క్లుప్తంగా

అభయాంజనేయునికి వార్షికోత్సవ పూజలు



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో కొలువు దీరిన అభయాంజనేయస్వామి పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఏకాహ మహోత్సవానికి కలశ స్థాపన జరిగింది. బ్రహ్మశ్రీ కాశీభట్ల వెంకటరమణమూర్తి, సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. స్వామి వారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద మంగళవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ పేర్కొంది.

చిన్నారికి నగదు సాయం



మాచవరంలో వెంకట్‌కు నగదు అందిస్తున్న చర్చి పెద్దలు, యూత్ సభ్యులు

అంబాజీపేట: కాళ్ల ఆపరేషన్ కోసం ఓ చిన్నారికి పి.గన్నవరం మండలం ముంజవరానికి చెందిన జేవీఏ చర్చి సంఘ పెద్దలు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నగదు సాయాన్ని సోమవారం అందించారు. దైవ సేవకులు ఎల్.జోసఫ్ చేతుల మీదుగా రూ.22 వేల నగదును మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన ఆరేళ్ల ఈతకోట సాత్విక్ తండ్రి వెంకట్‌కు అందజేశారు. తన కుమారుడు సాత్విక్ వైద్యానికి సహకరిస్తున్న దాతలకు వెంకట్ కృతజ్ఞతలు తెలిపాడు.

వృద్ధులకు అన్నదానం

మలికిపురం: గ్రామంలోని మేరీ మాత వృద్ధాశ్రమంలో వృద్ధులకు విశ్వేశ్వరాయపురం వివేకానంద కాన్వెంట్ ఆరో తరగతి విద్యార్థులు అన్నదానం చేశారు. చిన్నారులు తాము కిడ్డీ బ్యాంకులో దాచుకున్న నగదు నుంచి కొంత సొమ్మును ఈ అన్నదానానికి ఖర్చు చేశారు. స్వయంగా చిన్నారులే వడ్డించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ చిన్నారుల ఔదార్యాన్ని కొనియాడారు. ఈ కాన్వెంట్ నుంచి ప్రతి నెల ఒక తరగతి విద్యార్థులు ఇలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పద్మజ, ప్రసాద్ పాల్గొన్నారు.

కోటబాబు మృతి పార్టీకి తీరని లోటు



కోటబాబుకు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ నేత కొమ్ముల కోటబాబు మృతి పార్టీకి తీరని లోటని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. పెదపట్నంలంకకు చెందిన కోటబాబు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటబాబు సేవలను కొనియాడారు. పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, వాసంశెట్టి చినబాబు, వంటిద్దు వెంకన్ననాయుడు, సర్పంచ్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, నెల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రేపు ఉచిత దంత, కంటి వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత దంత, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్జరపు వెంకటసుబ్బారావు తెలిపారు. అమలాపురం ఆయుష్ డెంటల్ కేర్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ వారి సౌజన్యంతో దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరం అకీరా ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు, వర్కింగ్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గమ్మకు సహస్రనామార్చన

పి.గన్నవరం: శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ఆలయ అర్చకులు వాడపల్లి రాంబాబు ఆధ్వర్యంలో సహస్రనామ పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు కమిటీ నాయకుడు అడ్డగళ్ల నారాయణమూర్తి తెలిపారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం
- మనుగడ, జీవనం కోసమే పరభాష



తెలుగుతల్లి

కొత్తపేట: 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్నారు విజయనగర పాలకుడు శ్రీకృష్ణదేవరాయలు. మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి. తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో.. మాతృభాష కూడా అంతే. మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నంగా వస్తుంది. అమ్మ మాటే మాతృభాష. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. పరిరక్షించుకోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తు చేసేందుకే ఏటా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అలాగని ఒక్క మాతృభాషకే పరిమితం కాకుండా మనుగడ కోసం ఇతర భాషలను కూడా నేర్చుకోవాలి. దానిలో భాగంగానే ప్రధానంగా ప్రపంచమంతా ఇంగ్లీషు నేర్చుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

2000 సంవత్సరం నుంచి..

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఏటా ఫిబ్రవరి 21న నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి విద్యా విజ్ఞాన సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 30వ సాధారణ మహాసభ (1999 నవంబరు 17న) ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నింటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. బహుభాషల విధానాన్ని ప్రోత్సహించాలని, అది విశాల దృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుందని, అయితే మాతృభాషను కాపాడుకుంటూనే తక్కిన భాషల్ని నేర్చుకోవడం, అనంత విజ్ఞానాన్ని పొందడం సరైన మార్గమని యునెస్కో వెల్లడించింది.

అంతర్జాతీయ భాషగా ఇంగ్లీషు

నేటి ప్రపంచ దేశాలు, ప్రజల మధ్య సంబంధాలు ఎంతగానో పెరిగాయి. అనేక రకాలైన పనుల కోసం ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లడం సర్వసాధారణమైంది. అందువల్ల ఇంగ్లీషు అంతర్జాతీయ భాషగా ఆమోదం పొందింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రాథమిక స్థాయి నుంచీ మాతృభాషతో పాటు ఇంగ్లీషు నేర్చుకోవలసిన ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం అమలు చేస్తుంది.

రెండు భాషల్లో ముద్రణ



ఇంగ్లీషు ప్రపంచ భాషగా అన్ని దేశాలకు అనుసంధాన కర్తగా ఒక మాధ్యమంగా అవతరించిన తరుణంలో మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకం కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను రెండు భాషల్లో ముద్రించింది. పక్క పక్క పేజీలు ఒక పేజీ ఇంగ్లీషులో, ఆ పక్క పేజీలో మాతృభాషలో ఉండేలా పాఠ్య పుస్తకాలు ముద్రించింది. బోధన ఇంగ్లీషులోనే జరుపుతూ విద్యార్థులు మాతృభాషలో అర్థం చేసుకునేలా అవకాశం కల్పించడం హర్షణీయం.

– ఏటీసీ దేవ్,
కళాసాహితీ సభ్యుడు, కొత్తపేట

తెలుగు తప్పనిసరి చేయడం హర్షణీయం



మాతృభాషలో విద్యాబోధన సులభంగా ఉంటుంది. కానీ మారుతున్న కాలానుగుణంగా పోటీ ప్రపంచాన్ని తట్టుకుని ముందుకు వెళ్లాలన్నా, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నా ఇంగ్లీషు మీడియం ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమం నందు తెలుగును తప్పనిసరి సబ్జెక్ట్ చేయడం హర్షణీయం.

– యల్లమిల్లి నాగమణి,
తెలుగు ఉపాధ్యాయిని, కొత్తపాలెం

వైభవంగా త్రిశూల స్నానం



మందపల్లిలో ఉమా శనైశ్చరస్వామి త్రిశూల స్నానం నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి, మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వార్ల త్రిశూల స్నానం కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. మందపల్లిలో ఈఓ సింగం రాధ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అయిలూరి శ్రీరామమూర్తి, వేదపండితుడు శర్మ స్వామికి తైలాభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు, నిత్యాగ్నిహోత్రం, పూర్ణాహుతి అనంతరం బొబ్బర్లంక-ముక్తేశ్వరం కాలువలో త్రిశూల స్నానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తోరాటి గణేష్ తదితరులు, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలివెల ఉమా కొప్పేశ్వర క్షేత్రంలో ఉత్సవ కమిటీ చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, దేవస్థానం ఈఓ నడింపల్లి వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు ఉదయం నుంచీ స్వామికి అభిషేకాలు, విశేష పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం పలివెల వంతెన వద్ద బొబ్బర్లంక-అమలాపురం కాలువలో త్రిశూల స్నానం కార్యక్రమాన్ని భక్తుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు.

కాజ్‌వే పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



అప్పనపల్లిలో కాజ్‌వే పనుల్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అప్పనపల్లి ఉచ్చులవారిపేట మార్గంలో చేపట్టిన కాజ్‌వే పనుల్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సోమవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న పాత కాజ్‌వేను తొలగించి కొత్త కాజ్‌వే నిర్మాణం పనులు ఇటీవల చేపట్టారు. ఈ నేపథ్యంలో అక్కడ చేపట్టిన పనుల్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఏటా గోదావరి వరదల సమయంలో మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికే కాజ్‌వే ముంపు బారిన పడటం వల్ల మూడు లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. నూతన కాజ్‌వే నిర్మాణం వల్ల తీర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ముంపు సమస్యకు చాలా వరకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఎంతో కాలం నుంచి తీర గ్రామాల ప్రజలు కోరుకుంటున్న కాజ్‌వే ఆధునీకరణ తన హయాంలో కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ ఇచ్చిన ప్రత్యేక నిధులతో దీని నిర్మాణం జరుగుతుందన్నారు. ఇక్కడ జరుగుతున్న పనుల్ని పరిశీలించాలని ఫోన్లో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాను ఎమ్మెల్యే చిట్టిబాబు కోరారు. ఆయన వెంట పార్టీ నేతలు వాసంశెట్టి చినబాబు, గెడ్డం వెంకటేశ్వరరావు, కంకిపాటి హిమవంతరావు, బత్తుల జనార్దనరావు, భూపతి వెంకటపతి, ఇసుకపట్ల రాము, విప్పర్తి సత్యానారాయణ ఉన్నారు.

ఘనంగా చండీహోమం



చింతలూరు నూకాంబిక ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబికా అమ్మవారి ఆలయ ఆవరణలో శ్రీవైభవంగా సోమవారం చండీహోమం జరిగింది. మాఘ మాస అమావాస్యని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఈ హోమాన్ని నిర్వహించింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ చండీహోమంలో సుమారు 32 మంది దంపతులు పూజలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని నెల రోజుల ముందుగా నిర్వహించే బుట్టగరగ కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం జరుగుతుందని ఈఓ పేర్కొన్నారు.

తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పతకాలు సాధించిన క్రీడాకారులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు అంబాజీపేటకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని తిమూర్తులు తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో క్రీడాకారులను సోమవారం పలువురు అభినందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో 28వ ఇంటర్ క్లబ్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 19న జరిగాయన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో కె.అన్య, ఎం.మౌనిక, బీహెచ్ హ్రితిక్‌లు ప్రథమ స్థానంలో, జి.లహితాదేవి, జి.పూజితాదేవి, ఎంఎస్ఎస్ శ్రీకర్, ఆర్‌హెచ్‌వీ మూర్తి ద్వితీయ స్థానాల్లో, ఎం.వినూత్న, సీహెచ్‌వీఎస్ సతీష్, కె.లాస్య అద్విక, పీఎస్ సాత్విక్, బి.సుకాంత్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. క్యాడెట్ విభాగంలో ఆర్‌డీ శ్రీలక్ష్మి, ఎస్‌జెసి దేవ్, ఎన్.సుదీప్, ఎంఎస్ శరణ్య, ఏబీ చైతన్యలు ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన కె.అన్య, ఎం.మౌనిక, బీఎం.హ్రితిక్‌లు వచ్చే నెల వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

సంక్షేమ పథకాలపై మరింత చైతన్యానికి కృషి చేయాలి



సఖినేటిపల్లిలో గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజల్లో మరింత చైతన్యం తెచ్చే విధంగా గృహసారథులు కృషి చేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సూచించారు. సోమవారం సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపంలోను, వీవీమెరక కమ్యూనిటీ హాల్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి గ్రామంలోను గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లను కో ఆర్డినేషన్ చేసుకుని ఇంటింటా సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. అలాగే ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి అభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు. సీఎం జగన్ ఫొటో ముద్రించిన స్టిక్కర్లను లబ్దిదారుల ఇళ్లకు వారి అనుమతితో అంటించాలని సూచించారు. ఈ సందర్భంగా పథకాలు వివరించే బ్రోచర్లు, స్టిక్కర్స్‌లతో కూడి కిట్స్‌లను గృహసారథులకు ఎమ్మెల్యే ఈ శిక్షణ కార్యక్రమాల్లో పంపిణీ చేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ 1, 2 రాపాక దీవెనకుమారి, రుద్రరాజు చినరాజా, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, సర్పంచ్‌లు ఒగూరి రత్నకుమారి, కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీలు నల్లి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా యూనిట్ల పరిశీలన

మామిడికుదురు: కొబ్బరిపీచుతో తయారు చేస్తున్న బొమ్మలు, పీచుతో తయారు చేస్తున్న తాడు, గరాజీల తయారీని ఎస్ఆర్ఎల్ఎం ఆడిట్ టీమ్ లీడర్ శైలేంద్ర కుమార్ కారే సోమవారం పరిశీలించారు. అప్పనపల్లి, మామిడికుదురు గ్రామాల్లో ఆయన డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీతో పాటు మెషీన్ సహాయంతో డొక్కుతాడు తయారీ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అదే విధంగా మామిడికుదురులో గరాజీల తయారీని కూడా పరిశీలన చేశారు. శైలేంద్రకుమార్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులతో పాటు తినుబండారాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏపీడీ జిలాని, డీపీఎం అన్నపూర్ణ, ఏపీఎం భూపతి వర్మ, సీసీ దుర్గాకుమారి, వీఓఏలు ఉన్నారు.

ఎమ్మెల్సీ పదవులపై హర్షం



అంబాజీపేటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శెట్టిబలిజ నాయకులు

అంబాజీపేట: రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కుడుపూడి సూర్యనారాయణకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై మండలంలోని శెట్టిబలిజ సంఘ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో శెట్టిబలిజ సంఘ నాయకులు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సంఘ నాయకులు గుత్తుల ధర్మ, మట్టపర్తి రాము, కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు. అలాగే ముక్కామల సెంటర్‌లో వాసంశెట్టి తాతాజీ ఆధ్వర్యంలో గుబ్బల సత్యనారాయణ, పెచ్చెట్టి శ్రీనివాస్, కాండ్రేగుల గోపాలకృష్ణ తదితరులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి బాణసంచా కాల్చారు. బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడంపై అంబాజీపేటలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉందుర్తి నాగబాబు, ఉందుర్తి ఆనందబాబు, నేదునూరి ఏసు తదితరులు ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

శెట్టిబలిజ నేతల హర్షం

మలికిపురం: రాష్ట్రంలో శెట్టిబలిజలను గుర్తించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం నేతలు పేర్కొన్నారు. ఎమ్మెల్సీలుగా కుడుపూడి సూర్యనారాయణ, కవురు శ్రీనివాస్‌లను వైఎస్సార్ సీపీ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం మలికిపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద తాలూకా శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. తమ సామాజిక వర్గం నుంచి ఇద్దరికి ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడంపై సంఘీయులు హర్షం వ్యక్తం చేశారు.

'జగనన్నే మా భవిష్యత్'పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: మండలంలోని పొట్టిలంక, కొండుకుదురు, ఎస్.మూలపాలెం గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలతో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 18 నుంచి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, బొక్కా కామేశ్వరరావు, గుత్తుల శ్రీరామ్మూర్తి, కుడుపూడి విద్యాసాగర్, బ్రహ్మానందం, పులిదిండి ప్రభాకర్, పెట్టా జగన్, బొంతు రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రావులపాలెం: స్థానిక పారా సంస్థలో సోమవారం రౌతు కాశీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్టు ఫౌండర్ రౌతు ఈశ్వరరావు వైద్య సేవలు అందించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రూ.10 వేలు విలువైన మందులు ఉచితంగా అందజేశారు.

పళ్లాలమ్మ హుండీ ఆదాయం రూ.3.05 లక్షలు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ ద్వారా రూ.3,05,004 ఆదాయం వచ్చినట్టు ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ తెరచి లెక్కించారు. కార్యక్రమంలో డీసీసీబీ పర్సన్ బండారు రాజా, మాజీ సర్పంచ్ కామిశెట్టి అమ్మన్న, ఉప సర్పంచ్ గనిశెట్టి వీరేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, వానపల్లి భజన సమాజం సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

లంపి వ్యాధితో పుంగనూరు ఆవు మృతి

అంబాజీపేట: లంపి వ్యాధి సోకడం వల్ల పుంగనూరు ఆవు ఆదివారం రాత్రి మృతి చెందింది. మాచవరం మామిడిశెట్టి రాంబాబుకు చెందిన పుంగనూరు ఆవుకు లంపి వ్యాధి సోకడంతో గత 20 రోజులు అంబాజీపేట పశు వైద్యశాలలో వైద్యం చేయించారు. ఆ ఆవుకు వైద్య సేవలు అందించినప్పటికీ ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్లు రాంబాబు తెలిపారు. దీనిపై మాట్లాడుతూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నిర్ణీత సమయానికి టీకాలు అందించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలు వేశారు. చిన్నారులకు పలు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేశారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: వీవీమెరక గ్రామంలో మానసిక స్థితి లోపంతో నడవలేని పరిస్థితిలో ఉన్న లక్కింశెట్టి దేవి చంద్రకాంతంకు సోమవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. సోషల్ మీడియాలో ఆమె పరిస్థితి గురించి తెలుసుకున్న ఇజ్రాయేల్‌లో ఉంటున్న ఎన్నారై తాడి శ్రీనివాసు స్పందించారు. ఆయన పైమొత్తాన్ని స్థానికులకు పంపారు. ఈ మేరకు ఎమ్మెల్యే అందజేశారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, చింతా సుధాకర్‌రావు, గెడ్డం అమ్ములు, కారుపర్తి నాగేశ్వరరావు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

వార్షికోత్సవ ప్రత్యేక పూజలు

రావులపాలెం: స్థానిక సీతారామచంద్రస్వామి, షిరిడి సాయిబాబా ఆలయాల 16 వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 18 నుంచి 22 వరకూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈనెల 21న మంగళవారం సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు ఉదయం తొమ్మిది గంటలకు అభిషేకాలు లక్ష తులసి పూజలు సామూహికంగా జరుగుతాయన్నారు. అలాగే 22న బుధవారం షిరిడి సాయిబాబా వారికి 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకాలు, పెన్నుల పూజ జరుగుతాయన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

పి.గన్నవరం: ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు, తమ జాతిని దూషించిన రవికుమార్‌ను అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని పి.గన్నవరం నియోజకవర్గ మత్స్యకార సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు డిమాండ్ చేశారు. స్థానిక చేపల మార్కెట్‌లో సోమవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రవికుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై సమావేశం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. సమావేశంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆయకట్టు శివారు భూములకు నీరివ్వండి

అంబాజీపేట: శివారు ప్రాంత వరి చేలకు సాగునీరు అందకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని మాచవరం, ఇసుకపూడి రైతులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం వివరించారు. మాచవరం, ఇసుకపూడి పరిధిలోని 350 ఎకరాలకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వంతులవారీ విధానంలో 48 గంటలు మాత్రమే సాగు నీరు ఇస్తున్నారని ఆ నీరు కేవలం కాలువలకే సరిపోతుందని, చివరకు వచ్చే సరికి వరి చేలు తడిచే పరిస్థితి లేదన్నారు. గోపాలపురం నుంచి వచ్చే పంట కాలువ ఆక్రమణకు గురవ్వడంతో పాటు తూడు, తుప్పలతో నిండిపోయి సాగు నీరు ముందుకు సాగడం లేదన్నారు. తక్షణమే ఆక్రమణలు తొలగించి, పంట కాలువలను శుభ్రపరిచి సాగు నీరు ఇవ్వాలని ఇసుకపూడి, మాచవరంకు చెందిన రైతులు కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను కోరుతూ వినతిపత్రం అందజేశారు.

డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యాశాఖ కమిషన్ ఆదేశాలతో ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొని డిగ్రీ కళాశాలలో ఉన్న సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులను తదితర మౌలిక వసతులను తిలకించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఫుడ్ ఫెస్టను నిర్వహించారు.